కల్పితం ఏమీ లేదు. ఈ మాటలు మనకు అర్థంకాక అవి కల్పితం కింద, అబద్ధం కింద మనకు అనిపిస్తాయి. భగవంతుడు ఎందుకు అబద్ధాలు చెపుతాడు. ఆయన పట్ల మనకు గౌరవం లేనప్పడు ఆయన చెప్పిన మాటల మీద కూడా మనకు విశ్వాసం కలుగదు. మనలో దైవీసంపద లేనప్పడు సాక్షాత్తు భగవంతుడే రూపం ధరించి వచ్చి మనకు టీచింగ్ చెప్పినా అది నిలబడదు. భగవంతుడు ఉన్నాడనే నమ్మకం మనకు లేనప్పడు ఆయన చెప్పిన మాటల మీద మనకు గౌరవం ఎలాగ కలుగుతుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-8-2010, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడు చెప్పింది భగవద్గీత. కృష్ణుడు తల్లి దేవకీదేవి అని, తండ్రి వసుదేవుడు అని మనం అనుకొంటాము. ఆయన దేవకీదేవి గర్భంలో శరీరం ధరించలేదు. నా గర్భంలోనే జన్మించాడు అని దేవకీదేవి అనుకొనేలా చేసాడు. ఆయన శరీరం కర్మనిబట్టి రాలేదు, అవసరాన్ని బట్టి ఆయన శరీరాన్ని ఆయనే సృజించుకొన్నాడు. ఆయన స్వయంగా నారాయణుడు. కృష్ణుడు ఏ ఆత్మసుఖాన్ని అయితే పొందమని చెప్పాడో, ఏ సుఖంలోనికి మనల్ని మేల్కొలపటానికి ప్రయత్నం చేస్తున్నాడో ఆ సుఖం ధనం వల్లకాని, కీర్తివల్లకాని, అధికారం వల్లకాని, పాండిత్యం వల్లకాని రాదు. దానికి ఆచార్యుడి అనుగ్రహం ఉండాలి, ఈశ్వరుడి దయ ఉండాలి. ప్రపంచంతోటి, పంచభూతాలతోటి, ఇంద్రియాలతోటి, చావు పుట్టుకలతోటి సంబంధం లేనటువంటి శాంతిని, సుఖాన్ని పొందటం కోసం మీకు ఈ ప్రవచనాలు ఉపయోగపడాలనే మా ఉద్దేశ్యం. అంతకంటే ఇంకో ప్రయోజనం ఏమీలేదు. ఆత్మసుఖము బయట ఎక్కడో లేదు అది నీ హృదయములోనే ఉంది. మీరు ఏదో చేయటం వలన డబ్బు సంపాదించుకోవచ్చు, డిగ్రీ సంపాదించుకోవచ్చు, అధికారం సంపాదించుకోవచ్చు వీటి వలన ఆస్థితికి చేరుకోలేరు. నీ మనస్సుని, ఇంద్రియాలను శాంతపరుచుకొని, నీ బుద్ధిని ఏకాగ్రం చేసుకొని, తిండి దగ్గర బహుజాగ్రత్తగా ఉండి, మీ శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం కాపాడుకుంటేనే కాని ఆ స్థితికి మీరు చేరుకోలేరు అని ఆచార్యుల వారు చెప్పారు. మీకు మీ దేహముతోటి, మీ మనస్సుతోటి ఎంత తాదాత్మ్యం ఉన్నా, మీకు ఎంత ఇష్టం ఉన్నా ఆ రెండూ మీరు కాదు. ఇంకా వీటి లోపల ఒక సత్యము ఉంది. అక్కడ నుంచే సృష్టి వస్తోంది, జీవకోటి వస్తోంది. అది అంతటా ఉంది, మీ హృదయములో కూడా ఉంది. అక్కడకి మీరు మేల్కొవాలి, మిమ్మల్ని శాంతిసముద్రంలోనికి, సుఖసముద్రంలోనికి ప్రవేశ పెట్టటానికే ఈ ప్రవచనాలు, రచనల ప్రయోజనం అని ఆచార్యులవారు చెప్పారు.

ఈ నామ రూపాలన్నీ వికారాలు, ఎక్కడైతే ఆకారం ఉందో అక్కడ వికారం ఉంటుంది. స్వప్నం నిద్రలో వస్తుంది, జాగ్రదవస్థ అజ్ఞానంలో వస్తుంది. దానికీ, దీనికీ తేడా ఏమీ లేదు. స్వప్నంలో కనిపించే మనుషులు, స్వప్నంలో జరిగిన సంఘటనలు మీకు జాగ్రదావస్థలోకి

వచ్చాక కనబడవు, ఆ సంఘటనల ప్రభావం కూడా మీ మీద ఉండదు, అలాగే మీకు జ్ఞానం కలిగిన తరువాత ఈ లోకంలో ఉన్నటువంటి మనుషులు, జరిగిన సంఘటనలు కూడా అంతే. అందుచేత మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా స్వప్నమే, ప్రతికూలంగా ఉన్నా స్వప్నమే కాబట్టి ఈ లోకంలో మీరు పొంగిపోయేది ఏమీ లేదు, మీరు కుంగిపోయేది ఏమీ లేదు. దేహం ఈ సృష్టిలోకి ఏ పని మీద వచ్చిందో ఆ పని అయిపోయిన తరువాత బూడిద అయిపోతుంది. అందుచేత ఆ దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టి మీ లోపల ఉన్న పరమాత్మని చేరుకోవటమే మీ గమ్యం. అది తప్పించి మీరు ఏది సాధించినా స్వప్న సమానం. భగవద్గీతలో ఒక్క శ్లోకం మీకు అర్థమైతే మీ శోకం పోతుంది. నువ్వు మనస్సుతోటి తాదాత్మ్యం పొందినంత కాలం భగవద్గీతలో చెప్పింది నీకు అవగాహన అవ్వటం చాలా కష్టం. మన అహంకారంతోటి, మన అజ్ఞానంతోటి, మన మనస్సుతోటి ఎంత సహజంగా తాదాత్మ్యం పొందుతున్నామో అంత సహజంగా లోపలఉన్న పరమాత్మతోటి తాదాత్మ్యం వచ్చేవరకూ భగవద్గీతలోని మాటలు ఎన్ని చెప్పినా మనకి అర్థముకాదు. అది సత్యమైనా అసత్యము వలె కనిపిస్తుంది. మనస్సుతోటి మనకి తాదాత్మ్యం ఉంది కాబట్టి అదే నిజం అనుకుంటున్నాము కనుక దానిని తొలగించుకోవటానికి మనం ప్రయత్నం చేయము. ప్రయత్నం చేసినట్లు నటిస్తాము అంతే.

పుణ్యం బంగారపు సంకెళ్ళు, పాపం ఇనుప సంకెళ్ళు ఇవి రెండూ బంధిస్తాయి. ఈ పుణ్యపాపాలు దేహము, ఇంద్రియాలు, మనస్సు కలిసి చేస్తాయి. లోపలఉన్న ఆత్మకి వీటితోటి సంబంధంలేదు. అందుచేత మీరు లోపలఉన్న ఆత్మను తెలుసుకోవాలంటే మీరు దేహంతోటి, ఇంద్రియాలతోటి, మనస్సుతోటి చేసిన పనులు ఈ భూమి మీదే వదిలేయండి. లోపల పరమాత్మతోటి మీకు తాదాత్మ్యం ఉన్నప్పుడు, నేను చేస్తున్నాను అనే తలంపు లేనప్పుడు మూడు లోకాలని భస్మం చేసినా నీకు పాపము లేదు అన్నాడు పరమాత్మ. అయితే ఆశక్తి పరమాత్మకి, పరమాత్మని తెలుసుకున్నవాడికి వస్తుంది కాని జీవకోటికి అది సాధ్యంకాదు. మీకు శరీరంతోటి, ఇంద్రియాలతోటి, మనస్సుతోటి, చావుపుట్టుకలతోటి ఎంత సహజంగా తాదాత్మ్యం ఉందో అంత సహజంగా నీ హృదయంలో ఉన్న సత్యంతోటి తాదాత్మ్యం పొందటానికి నువ్వు ప్రయత్నం చేయటమే నీ సాధన యొక్క గమ్యం. అర్జునా నువ్వు శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకో, నీ అహంకారం ఎలా చెబితే అలా చేయకు, వినయంగా ఉండటం నేర్చుకో, ధర్మాన్ని ఆచరించటం నేర్చుకో, ధర్మం అంటే కేవలం దానం అనికాదు. జీవిత విధానం, భగవంతుడు చెప్పిన పని చెయ్యటం, భగవంతుడు వద్దని చెప్పిన పని మానేయటం అది ధర్మం. ధర్మాన్ని నువ్వు ఆచరిస్తే నీ చదువులతోటి, వేదాలతోటి సంబంధం లేకుండా విషయ చింతన తగ్గిపోయి ఆత్మచింతన పెరుగుతుంది. నువ్వు ధర్మాన్ని ఆచరించవనుకో నీకు ఎంత డబ్బు ఉన్నా, పాండిత్యం ఉన్నా విషయచింతన పెరిగిపోతూ ఉంటుంది, ఆత్మచింతన తగ్గుతూ ఉంటుంది. వాల్మీకి రామాయణంలో ఆత్మజ్ఞానం కంటే, మోక్షం కంటే ధర్మం గురించి ఎక్కువ చెప్పాడు. ధర్మాన్ని

ఆచరించకుండా జ్ఞానంరాదు అని చెప్పాడు. రాముడి పట్టాభిషేకం చెడగొట్టి భరతుడికి పట్టాభిషేకం చేయాలనే తలంపు కైకకు కలగలేదు, మంధరకి కలిగింది. వాల్మీకి ఋషి అరచేతిలో ఉన్న వస్తువుని ఎంత స్పష్టంగా చూడగలమో అలా వాడి హృదయంలో ఉన్న సత్యాన్ని దర్శించిన వాడిని ఋషి అంటారు. వాల్మీకి ఏమని చెప్పాడు అంటే రాముడిని అరణ్యవాసానికి పంపాలని కుట్ర పన్నటానికి మందర కైక విశ్రాంతి గదిలోకి నడిచి వెడుతోంది, అక్కడ మంధర నడవటంలేదు రావణాసురుడు చేసిన పాపం మంధర రూపం ధరించి అడుగులు వేసుకొంటూ కైక గదిలోనికి నడిచివెడుతోంది అని చెప్పాడు. ఎందుచేతనంటే రాముడిని బయటకు పంపకపోతే అరణ్యానికి వెళ్లడు, అరణ్యానికి వెళ్లకపోతే రావణాసురుడు సీతను తీసుకొనివెళ్లటానికి అవకాశం లేదు. అక్కడ రావణాసురుడి సంహారం జరగదు. మనం మంధర అలా చేసింది, ఇలా చేసింది అనుకుంటాము కాని రావణాసురుడు చేసిన పాపాలు ఒక రూపం ధరించి వచ్చింది అదే మంధర అంటాడు వాల్మీకి. అది మనం ఊహించలేము. భగవంతుడు రావణాసురుడిని సంహారం చేయటానికి మంధరని ఇక్కడ కల్పించాడని చెప్పటం, ఈ మాటలో ఉన్న అందాన్నే మనం భరించలేకపోతున్నాము, ఇంక ఆత్మని ఎక్కడ భరించగలము.

వాల్మీకి రామాయణంలో భరతుడు గురించి చెప్తాడు వాడు కష్టాలు అనుభవించటానికి, అందరిచేత మాటలు అనిపించుకోవటానికే పుట్టాడు అన్నాడు. భరతుడు మేనమామల ఇంటి దగ్గర ఉండగా కైక భరతుడికి పట్టాభిషేకం చెయ్యమని అడిగింది. ఇది భరతుడికి తెలియదు. కాని భరతుడికి తెలయకుండా తల్లి ఈ పని చేసిందా ఈ కుట్రలో భరతుడు ఉన్నాడని ప్రపంచానికి అనుమానం వచ్చింది. ఈ మాటలు భరిస్తున్నాడు, అందరిచేత అనుమానించబడుతున్నాడు పోనీ ఈ గొడవలు అన్నీ వదిలి, సుఖంగా ఉందాము అనుకుంటే రాముడు అరణ్యానికి వెళ్లి తిరిగి వచ్చేవరకు పరిపాలన చేయవలసి వచ్చింది. రాముడు పాదుకలు సింహాసనం మీద పెట్టి భరతుడు పరిపాలన చేసాడు. భరతుడు అందరిచేత అవమానాలు పడుతున్నప్పటికీ తన ధర్మమార్గం విడిచిపెట్టలేదు. తులసీదాసుగారు అన్నారు అందరూ రామరామ అనుకుంటారు కానీ రాముడు మాత్రం భరత, భరతా అనుకుంటాడు. వాడు భరతుడు. భరతుడు హృదయం ప్రజలకు తెలియకపోయినా దేవుడికి తెలుసుకదా. మనం దేవుడిని స్మరిస్తూ ఉంటే దేవుడు భరతుడిని స్మరిస్తున్నాడు. ఎందుచేతనంటే భరతుడు లోకానికి సంబంధించిన మనిషికాదు, ఆయనా దేవుడే. అజ్ఞానం ఉంటే జీవుడు, జ్ఞానం ఉంటే దేవుడు. నువ్వు అజ్ఞానంలోంచి బయటకు రా దేవుడితో సమానం అవుతావు. మన మనస్సు శాంతిగా లేదు అనుకోండి మనకి ఇష్టమైనా వస్తుంది, అయిష్టమైనా వస్తుంది, బయటనుంచి ఏమైనా గొడవలు వస్తే ఉద్రేకం వచ్చేస్తుంది. మన మనస్సు శాంతిగా ఉంది అనుకోండి. బయట గొడవలు ఏమి వచ్చినా మనకు ఏమీ అనిపించదు. మీకు ఇష్టాలు, అయిష్టాలు ఎక్కువగా ఉంటే తగ్గించుకోండి, ఇష్టాలు అయిష్టాలు ఎక్కువ అవుతూ ఉంటే మనస్సులో చాపల్యం పెరిగిపోతుంది. మీరు

నిర్మలంగా కూర్చుని లోపల మీ మనస్సు ఎలా ఉందో చూసుకోండి. మనస్సు ఎటైనా కదులుతోంది అనుకోండి మీకు అక్కడ ఇష్టమైనా ఉండాలి, అయిష్టమైనా ఉండాలి. లేకపోతే మనస్సు కదలదు. మన చావు పుట్టుకలకు కూడా ఈ ఇష్టాయిష్టాలే కారణమని మనకి తెలియటంలేదు. మీ జీవితం పొడుగునా ఎవరికోసమైతే కష్టపడ్డారో వారు మీ శరీరం చనిపోయినప్పుడు ష్మశానానికి కూడా రారు. ఈలోపు మీరు వాళ్ళగురించి మీ మనస్సును కుళ్ళబెట్టుకొంటున్నారు. ఈ కుళ్ళబెట్టుకున్న మనస్సు మనకూడా వచ్చేస్తుంది. మనలో ఒక్క వాసన ఉంటే అనేక జన్మలు పీడించేస్తుంది. చెడ్డ తెచ్చుకోవటం తేలిక, దానిని వదిలించుకోవటం చాలా కష్టం. నువ్వు సమానబుద్ధిని ప్రాక్టీసు చెయ్యి. రాగద్వేషాలు తగ్గించుకో. నీకు రాగద్వేషాలు లేకపోతే నీ బుద్ధికి చాపల్యం తగ్గిపోతుంది, మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోతుంది, ఇంద్రియనిగ్రహం నీకు అలవాటు అవుతుంది.

పాండిత్యం ఉంటే సరిపోదు, వివేకం ఉంటే సరిపోదు. వైరాగ్యం ఉంటే సరిపోదు సదాచారం ఉండాలి. సదాచారం లేనివాడు ఆచార్యుడు కాలేడు. వాడు ఏ ఆనందాన్ని అయితే పొందుతున్నాడో, ఆ స్థాయిలోనికి మిమ్మల్ని తీసుకువెళ్ళటమే ఆచార్యుడు చేసేపని. పరమేశ్వరుడు ఆయన హృదయంలోనికి లాక్కుంటే మనం వెళ్ళగలం కాని ఇంటిదగ్గర కూర్చుని పీక్కుంటే ఆయన దగ్గరకు వెళ్ళలేము. పరమాత్మ యొక్క దయను సంపాదిస్తే, ఆయన హృదయంలో మనకి చోటు ఇస్తే మనం అక్కడకు వెళ్ళగలము. కొంతమందికి ఏమీ పని ఉండదు. వాళ్ళ దగ్గర కూర్చుంటాము అనుకోండి, వాళ్ళని వాళ్ళు పొగుడుకుంటూ ఉంటారు. అటువంటప్పుడు మనం అబద్దాలు చెప్పి బయటకు వెళ్ళినా పాపంలేదు. ఎందుచేత పాపం లేదు అంటే మనల్ని మనం రక్షించుకోవటంకోసం బయటకు వెడుతున్నాం కాని వారికి మనం ఏమీ చెడ్డ చేయటంలేదు. అక్కడ అది సాధించాము, ఇక్కడ ఇది సాధించాము అని చెబుతూ ఉంటారు. వాడి హృదయంలో ఏమి ఉందో వాడికి తెలియటంలేదు. ఇంక వాడు ఏమి సాధించాడు? పోనీ సాధించాడు. దేనితోటి సాధించాడు. దేహంతోటి, ఇంద్రియాలతోటి, మనస్సుతోటి సాధించాడు. ఆ మూడూ వాడుకాదు, ఆ మూడూ ఎంత నిజమో ఆ మూడింటితోటి సాధించే గొడవలు కూడా అంతే నిజం. ఇది అంతా నిజంకాదని జ్ఞానం యొక్క తూకం తెలిసినవాడికి తెలుస్తుంది.

యోగం అంటే ఏమిటి అంటే నువ్వు ఏ పని చేసినా ఆ పనిచేత నువ్వు బంధింపబడ కూడదు. నువ్వు సమత్వం అలవాటు చేసుకొంటే, రాగద్వేషాలు తగ్గించుకొని పని చేస్తూ ఉంటే నువ్వు చేసే పని నిన్ను బంధించదు. పుణ్యపాపాలు సంకెళ్ళులాంటివి. నువ్వు పని చేసేటప్పుడు నీకు పుణ్యం అంటుకోకూడదు, పాపం అంటుకోకూడదు. అంటుకొంటే అవి నిన్ను విడిచిపెట్టవు. అందుచేత నువ్వు పని చేస్తూ ఉండాలి దానిచేత నువ్వు బంధింపబడ కూడదు. అలా నేర్చుకొని నువ్వు పని చేస్తే అదే యోగము. వాలి భార్య వాలికి మంచి చెప్పేది

అలాగే రావణాసురుడి భార్య రావణాసురుడికి మంచి చెప్పేది. అలా మంచి చెప్పి తరువాత వాళ్ళ ప్రారబ్దం ఎలా ఉంటే అలా అవుతుంది అని వదిలేసేవారు అంతేగాని వారు భగవంతుడు పాదాలు ఎప్పుడూ విడిచిపెట్టలేదు. అవసరమైనపుడు మాట్లాడాలి, అవసరం లేనప్పుడు మౌనంగా ఉండాలి అలా మన డ్యూటీ చెయ్యాలి. అంతేగాని ఏదో నాలుగు రోజులు జాగ్రత్తగా ఉండి ఇంద్రియాలను జయించేసాం, మనస్సుని జయించేసాం అని అనుకోకండి. మీకు తెలియకుండా లోపల వాసన ఉంటుంది. మీరు చిన్నప్పుడు మాంసం, చేపలు ఇష్టంగా తిన్నారు అనుకోండి ఇప్పుడు ఆరోగ్యంకోసమో, పాపం అనో మానేసారు అనుకోండి అంత మాత్రంచేత అవి జయించేసామని అనుకోకండి. మీరు చేపలు ఇప్పుడు తినటం లేదని దాని వాసన పోయిందని అనుకోవద్దు. అలా అనుకుంటే ప్రమాదంలో పడతారు. మీ నోరు మటుకు తినటంలేదు. అలాగని మీకు చేపలమీద ఇష్టం పోయిందని అనుకోవద్దు. భగవంతుడు ముందు జాగ్రత్తకోసం చెబుతున్నాడు. అది వాసన రూపంలో ఉండిపోతుంది. ఆ వాసనలు ఒక జన్మలో పోవు. మీ లోపల అంతర్యామిగా ఉన్న పరమాత్మ అనుభవం మీకు కలిగినప్పుడు ఆ వాసన పోతుంది కాని అప్పటివరకూ అది పోయిందని నమ్మటానికి వీలులేదు. మళ్ళీ అది ఎప్పుడైనా విజృంభించవచ్చు. ఈ జన్మలో కాకపోయినా, రాబోయే జన్మలో అయినా విజృంభించవచ్చు. మీరు బాహ్యంగా ఇంద్రియాలతోటి విషయాలు ముట్టుకోకపోయినా మేము జయించేసాము అని అనుకోకండి. అవి బయట గొడవలే, మీ లోపల ఇంకా చాలా గొడవ ఉంది. ఆ లోపల ఉన్న గొడవ వచ్చే జన్మలో కూడా మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటుంది. ఏ జన్మలో అయితే మీకు పరమాత్మ దర్శనం అయ్యిందో అప్పుడు ఆ వాసనలు నశిస్తాయి.

సూర్యుడు భూమికంటే పెద్దవాడు అయినా సూర్యుడిని ఒక చిన్న మేఘం మన కళ్ళకి కనబడకుండా చేయగలదు. అలాగే మన హృదయంలో ఉన్మ పరమాత్మని మనకి అనుభవంలోనికి రాకుండా ఈ మనస్సు అడ్డుపడుతోంది. మనస్సు చిరిగిపోయే వరకూ అది అడ్డుపడటం మానదు. మీరు మృదువుగా హృదయంతోటి మాట్లాడుతున్నారు అనుకోండి మీరు హితవుగా, మితంగా మాట్లాడుతూ ఉంటే, మీరు చేసేపని సైలెంట్‌గా చేస్తూ ఉంటే ఇవన్నీ నెమ్మదిగా మనస్సు చిరిగిపోవటానికి మనకి సహాయం చేస్తాయి. అంటే మీ చేతలు, మీ మనస్సు, మీ మాట మనస్సు చిరిగిపోవటానికి ఉపయోగించుకోండి. కొంతమంది మంచి పనులు చేసినా మనస్సులో ఏదో స్వార్థం పెట్టుకొని చేస్తారు. దాని వలన పుణ్యం రావచ్చు కాని మనస్సు పలచబడదు, చిరగదు, మనస్సు గట్టిపడిపోతూ ఉంటుంది. మలదోషం, విక్షేపదోషం, ఆవరణదోషం ఈ మూడు మనిషి వెంట నీడ వచ్చినట్లు, ఆత్మజ్ఞానం కలిగేవరకూ ప్రతీ జన్మలో వెంటాడుతూ ఉంటాయి. శరీరంలో మలం ఎలా ఉంటుందో అలాగ మనస్సులో కూడా మలం ఉంటుంది. శరీరంలో ఉన్న మలం ఇనిమా చేసుకుంటే పోతుంది కాని మనస్సులో ఉన్న మలం అలా పోదు. అనేక జన్మల నుంచి మనం చేస్తున్న నిషిద్ధకర్మలు అలా మలంగా

మారిపోతాయి. అందులోంచి మనం ఎంతకాలమైతే విడుదల పొందలేమో అంతకాలం మనకి జ్ఞానం రాదు. ఆ మలదోషం పోవాలంటే ఈశ్వరుడి దయ, గురువు అనుగ్రహం ఉంటేకాని ఆ మలం పోదు. మన శరీరం ఒకచోట ఉంటుంది, మనస్సు ఒకచోట ఉంటుంది అది విక్షేపదోషం. ఈ దోషం ఉన్నా మీకు ఆత్మజ్ఞానం కలుగదు. నిరంతరం మీ ఇష్టదైవాన్ని ప్రార్థించుకోవటం వలన విక్షేప దోషం పోతుంది. అన్నిటికంటే ఆవరణ దోషం పోవటం చాలా కష్టం. నావాళ్ళు, పరాయివాళ్ళు అని స్వపరభేదం కలిగి ఉండటం ఆవరణ దోషం. ఉన్న సత్యం ఉన్నట్టుగా మీకు గోచరించేవరకూ ఆవరణ దోషం పోదు. ఏరకంగా అయినా ఈ మూడు దోషాలలో నుండి మన లోపల ఉన్న అంతఃకరణం విడుదల అయితేగాని మనకి జ్ఞానంరాదు. ఈ మూడు దోషాలలో నుండి బయటపడితేగాని మనం చేసిన సాధన సక్సెస్ అవ్వదు. అయితే ఫెయిల్ అయినా మనం ప్రయత్నం మానకూడదు. అలా సాధన చేస్తూ చేస్తూ ఉంటే వీళ్ళు కష్టపడి సాధన చేస్తున్నారు అని గురువు అనుగ్రహం ఎప్పుడో సడన్‌గా వస్తుంది. మీరు టీచింగ్ శ్రద్ధగా శ్రవణం చేస్తూ ఉంటే ఇది అభ్యాసం చెయ్యాలి అని ఇంటరెస్ట్ కలుగుతుంది. మనం అజ్ఞానాన్ని తొలగించుకోవాలి. లోపల ఉన్న సద్వస్తువు మనకి అనుభవంలోనికి రావాలి, ఈ జన్మలోనే మనం అది సాధించాలి అనే పట్టుదల మీ బుద్ధికి వస్తే మీ అభివృద్ధిని ఎవరూ ఆపుచేయలేరు. మీకు ఆ బుద్ధి రావటం వలన తొందరగా బాగుపడతారు. జ్ఞానం అనే అగ్ని మీ లోపల నుంచి ఉదయించాలి. లోపల నుంచి జ్ఞానం ఉబికి, ఉబికి మీ సహస్రారాన్ని ముంచేస్తూ ఉంటే ఒకవేళ దోషాలు అనే కట్టెలు ఉన్నా, బలహీనతలు అనే పిడకలు ఉన్నా అవి జ్ఞానాగ్నిలో కాలిపోతాయి అంటాడు పరమేశ్వరుడు. మళ్ళీ మీరు శరీరం ధరించి అనుభవించనక్కరలేకుండా కాలిపోతాయి, జ్ఞానాగ్ని అటువంటిది. జ్ఞానంతోటి సమానమైనది ఈ లోకంలోకాని, పరలోకంలోగాని ఏదీలేదు, అటువంటి జ్ఞానాన్ని సముపార్జించు అర్జునా అది సత్యజ్ఞానం అన్నాడు పరమాత్మ.

రామకృష్ణపరమహంస ఏమన్నారు అంటే పిల్లలు స్థంభాన్ని చేత్తోపట్టుకొని స్థంభం చుట్టూ స్పీడుగా తిరుగుతూ ఉంటారు వాళ్ళకి పడిపోతామనే భయంకూడా ఉండదు. అలాగే మీరు మీ మనస్సుని భగవంతుడు పాదాలకి కట్టేసుకొని మీ సంసార పనులు చూసుకోండి అప్పుడు పడిపోతామనే భయం ఉండదు. ఎందుచేతనంటే అక్కడ పరమాత్మ ఆధారంగా ఉన్నాడు. మీకు ఒకవేళ దుఃఖం వచ్చినా ఏమీ అనిపించదు, భోగం వచ్చినా ఏమీ అనిపించదు. అక్కడ పరమాత్మ సపోర్టు ఉంది. భక్తుడి లక్షణాలు నువ్వు కూడా సంపాదించుకో. నువ్వు ఎవ్వరినీ భయపెట్టవద్దు, ఎవ్వరికీ నువ్వు భయపడకు, నీమీద ఇష్టంలేని వాళ్ళు, నీ పట్ల అసూయ ఉన్నవాళ్ళు నీకు అశాంతి, ఉద్రేకం కలగచేయటానికి వాళ్ళు పని చేస్తూ ఉంటారు. అప్పుడు కూడా నువ్వు వికారం లేకుండా ఉండు. అది భక్తుడి లక్షణం, అది నువ్వు సంపాదించుకో అర్జునా అన్నాడు పరమాత్మ. రమణమహర్షిగారిని ఎవరైనా విమర్శించినా

ప్రశాంతంగా ఉండేవారు. మిమ్మల్ని విమర్శించినా మీరు ఎందుకు ప్రశాంతంగా ఉంటున్నారు అని అడిగితే ఆయన ఏమనేవారు అంటే వాళ్ళు ఎందుకు విమర్శిస్తున్నారో మీకు అర్థమవ్వకపోయినా నాకు అర్థం అయినప్పుడు అశాంతి ఎందుకు వస్తుంది అన్నారు.

మీ లోపల ఏ వాసన ఉందో మీకు తెలియదు. అది తలంపు కింద వచ్చిన తరువాత మీకు తెలుస్తుంది. అది మీ లోపల వాసనగా ఉన్నప్పడే చూస్తాడు వాడే గురువు, వాడే దేవుడు. వాసన చాలా బలీయంగా ఉంటుంది, లోపల అణిగి ఉంటుంది. పరమాత్మ దర్శనం అయ్యేవరకూ అది కాలి బూడిద అవ్వదు. మనస్సుని రెచ్చగొట్టకు. మనస్సుని, ఇంద్రియాలను శాంతిగా ఉంచుకో. నువ్వు రాక్షస తిండి తినకు. మనకి చేతిమీద పుండు పడితే ఆ పుండు మీదే ఆయింటుమెంటు రాసుకుంటాము కాని ఒళ్ళంతా రాసేసుకోము అలాగే నీ ఆకలికి సరిపడే తిను. మితంగా, యుక్తంగా తిను. నీ శరీరాన్ని, నీ మనస్సునీ అనారోగ్యానికి గురికానివ్వవద్దు. పరమాత్మ దర్శనానికి ఈ రెండింటిని ఉపయోగించుకో. ఆరోగ్యం చెడిపోతే ఇంక నువ్వు సాధనకు పనికిరావు. కొంతమందికి నోరు ఒకటే ఉంటుంది కానీ నాలుకలు పది ఉంటాయి. రోజుకి పది రకాలుగా మాట్లాడతారు. వాళ్ళని నువ్వు అనుకరించకు. అవినయం రాకుండా చూసుకో. ఎక్కువ ఖరీదైన బట్టలు కట్టవద్దు, సాధారణ వస్త్రాలే ధరించు. బావుందని రాక్షసులు తిన్నట్టు ఎక్కువ తినేయకు. దాని వలన నీ మనస్సు పాడైపోతుంది. నీ పని ఏదో నువ్వు చేసుకుంటూ ఎక్కడా ఆసక్తి పెట్టుకోవద్దు. అది ఎప్పుడు జరగాలో, ఎక్కడ జరగాలో, ఎలా జరగాలో అలా జరుగుతూ ఉంటుంది. భగవంతుడు ఒకవేళ మీ పనికి ఫలితం ఇవ్వటానికి లేటు చేస్తే మన మంచికోసమే లేటు చేస్తున్నాడని అనుకోండి. నిదానంగా ఉండండి, తొందరపాటు పనికిరాదు. ఇతరుల పనులలోకి మీరు వెళ్ళకండి. మీ పనులేవో మీరు శ్రద్ధగా చేసుకోండి మీ పనులలో లోపాలు ఉంటే సవరించుకోండి. ఇతరులను అనుకరించకండి. నీ స్వధర్మమేదో నువ్వు చూచుకో. ఆ రకంగా జీవిస్తూ ఉంటే నువ్వు చనిపోయేటప్పుడు శాంతిగా చనిపోతావు. భగవంతుడు నీకు ఏ పని అయితే అప్పగించాడో ఆ పని వదిలేసి ఎవరో ఏదో పని చేస్తున్నారని ఆ పనిలోనికి వెళతాను అంటే నువ్వు చనిపోయేటప్పుడు దుఃఖపడుతూ, అశాంతితోటి చస్తావు. ఐన్‌స్టీన్ చనిపోయినప్పుడు ప్రశాంతంగా చనిపోయాడు. వాడు జీవితం పొడుగునా స్వధర్మంలోనే ఉన్నాడు, పరధర్మంలోనికి వెళ్ళలేదు. ఐన్‌స్టీన్‌కి ప్రధానమంత్రి పదవి, గవర్నరు పదవి ఇస్తానంటే నేను చేసేది అంతా చేతులతోటి చేసేపనికాదు మెదడుతో చేసేపనికి నేను అలవాటు పడ్డాను నాకు భగవంతుడు ఈ పని కేటాయించాడు అని స్వధర్మం వదిలి పెట్టలేదు. అందుకే చనిపోయేటప్పుడు ప్రశాంతంగా చనిపోయాడు. భగవంతుడు చెప్పేది ఏమిటి అంటే బయట గొడవలు నీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా అది వచ్చి నీ మనస్సుని ముట్టుకోకూడదు. అవి దేహప్రారబ్ధాన్నిబట్టి వస్తాయి. స్వధర్మాన్ని కాపాడుకోవాలి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| సెప్టెంబర్ | 23 | సత్యసాయి నిగమ్, హైదరాబాద్ (శ్రీ నాన్నగారి పుట్టినరోజు) |
| అక్టోబర్ | 2 | శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

\- Mahabharatha



**శ్రీ శైలంలో సద్గురు శ్రీ నాన్నగారితో**
**ఆంధ్రప్రదేశ్ దేవాలయముల కమీషనర్**
**జె.యస్.వి. ప్రసాద్‌గారు**

# గురువును కపటం లేకుండా ప్రేమించటమే – తపస్సు

ఈ ప్రపంచంలో నిజమైన ప్రేమ అరుదు. మనం ప్రాపంచిక బంధనాలను సాధ్యమైనంతవరకూ తెంచుకొంటేగాని గురువు మీద ప్రేమ తిరగదు. ప్రేమలో జీవితాన్ని త్యాగం చెయ్యవలసి ఉంటుంది. ప్రతిఫలం ఆశించకుండా గురువును ప్రేమించాలి. తల్లి తన బిడ్డను తన గర్భంలో పూర్ణత్వంకోసం కొంతకాలం ఉంచుకొంటుంది. గురువుకూడా శిష్యుడిని తన మానసిక పరిధిలో కొంతకాలం ఉంచుకొంటాడు. ఆ సమయంలో గురువు నుంచి శక్తిని గ్రహిస్తాడు. ఆయన యోచనా తరంగాల నుండి పోషణను గ్రహించి పరిణితి చెందుతాడు. గురువుకు మనం ఇష్టమైతేనే మనం ఆయనను నిరంతరం ప్రేమించగలము. నిత్యసహచరునిగా చేసుకోగలము. గురు ప్రేమలో తనలో అణువణువునా ఆరాధించేజ్ఞానస్వరూపుడైన గురువు తానుగా నిలిచే అవకాశం ఉంటుంది. గురువు తేలిక పదాలతో అపరిమితమైన తత్త్వాన్ని తెలిపేటప్పుడు స్థిర నిశ్చయంతో అంతరంగంలో ఉంటే సత్యాన్ని తప్పక గ్రహిస్తాడు. దివ్యపురుషుడైన గురువును మనం చూడటం వల్ల మన మనస్సు సూక్ష్మమూ-శుద్ధమూ అవుతుంది. అప్పుడు బాధా తప్తహృదయుడై ఆయన కృపను, కరుణను అర్థిస్తూ ప్రార్థన సలపాలి. ఇది విజయసాధనకు అత్యంత తిరుగులేని ఉపాయం. దాని ద్వారా మనం పవిత్రులమై ఆయనతో సంబంధం ఏర్పడుతుంది. శ్రీనాన్నగారు "అహంకారం నమ్రత వల్ల గురు ప్రేమ స్పర్శ వల్ల మాత్రమే నశిస్తుంది. కర్మ, జ్ఞాన, యోగాలవల్ల పూర్తిగా నశించదు. సద్గురువును ప్రేమగా తలచుకొంటేచాలు మీ సాధన జయప్రదమౌతుంది. ఒకజ్ఞాని కరుణ మన మీద పడితే ఒక్క క్షణంలో జ్ఞానం వస్తుంది" అన్నారు. గురువుకు శరణాగతి కావాలి మన మనోబుద్ధులను ఆయనకు సమర్పించాలి వారి ఆదేశాలను శిరసావహించాలి. జాలి హృదయం నుంచే నైతిక ప్రవర్తన వస్తుంది దానితో మనం ఉత్సాహంగా ఉంటాము. భక్తి పరిపూర్ణమైతే ప్రేమ. అది నిజమైతే పూజలు, కర్మకాండలు తపస్సులు ప్రేమ లేనిదే శూన్యం. గురుగోవిండ్‌సింగ్ "ప్రేమ మార్గాన్ని అనుసరించిన వారు మాత్రమే పరమాత్మను పొందుతారు" అన్నారు. కొంగ పిల్లలను వదలి ఎంతదూరం వెళ్ళినా అలాగే తాబేలు గుడ్లుపెట్టి సముద్రంలోకి వెళ్ళినా వాటి ధ్యాస పిల్లలమీదే ఉంటుంది. అలాగే గురువు ధ్యాస ఎప్పుడు తన శిష్యులమీదనే ఉంటుంది. శిష్యుడు దూరంలో ఉన్నా సమస్యలేదు. రక్షణ అభయహస్తాలు ఎప్పడూ ఉంటాయి. మనం నిర్మల ప్రేమ పూరితంగా ఉంటాము. గురువు ముక్తికి దాతలు వారిపై ధ్యానం అన్ని మలినాలను కడిగి శుభ్రం చేస్తుంది. అజ్ఞాన తెర తొలగుతుంది. కష్టసుఖాలను కావడికుండలుగా భావించే శక్తి అలవడుతుంది. శాంతి పరిమళిస్తుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**